# నివురు రాలిన నిప్పు

ఝాన్సీ శరీరం సన్నగా కంపిస్తూంది. ఆమె హృదయంలోని పులకింత విద్యుత్తరంగంలా శరీరంలోని ప్రత్యణువుకూ వ్యాపిస్తోంది. ఆత్మవిశ్వాసంతో ఆమె కళ్లు తేజోవంతమయ్యాయి. రెండు నెలలుగా ఆమె పడిన శ్రమ ఫలించింది. సమాజపు అంచుల్లోకి నెట్టబడిన ఆ పిల్లల్లోని ప్రతిభ, సృజనాత్మకత నివురును విదుల్చుకున్న నిప్పులా కణకణలాడుతూ వేదికపై ప్రజ్వరిల్లుతున్నాయి. వేదిక ముందు కూర్చున్న వారు విభ్రాంతితో నాటకాన్ని చూస్తున్నారు.

ఆ దృశ్యాన్ని చూచిన ఝాన్సీ కనురెప్పల కింద చెమ్మ. తన నమ్మకం వమ్ము కాలేదు. ఆశ నిరాశ కాలేదు. తన వాదనలు ఓటమిపాలు కాలేదు. అవకాశం ఉంటే, మార్గ దర్శకత్వాన్నిస్తే ఈ పిల్లలు అందరిలాగానే రాణిస్తారు. తరతరాలుగా అన్ని అవకాశాలూ నిరాకరింపబడిన వీరికి తగిన ప్రోత్సాహమిస్తే ఇలా శిలల్లా మిగిలిపోరు. శిల్పాలై మనం శతాబ్దాలుగా నిర్మించుకున్న బూటకపు విశ్వాసాల్ని కూలదోస్తారు అంటూ వాదించిన తనకు ఒకరిద్దరు అధ్యాపకులు తప్ప మిగతా వారి నుంచి వ్యతిరేకతే వచ్చింది. తనను బలపరిచిన వారితో పాటు మిగతా వారినికూడా ఒప్పించి, కూడగట్టుకుని ఈ స్కూలు చరిత్రలోనే మొట్ట మొదటిసారి వార్షికోత్సవాన్ని జరపడంతో కృతకృత్యురాలైంది తను. మొదలు పెట్టినప్పుడు తన ప్రయత్నం ఇంత ఫలవంతమవుతుందని తనూహించలేదు. వివిధ సాంస్కృతిక అంశాలకు సెలక్ట్ చేసిన పిల్లల్లోని భయాన్ని, బెరుకును, ఆత్మన్యూనతను పోగొట్టడానికి తను చాలా శ్రమించింది. వారిలో విశ్వాసాన్ని, పట్టుదలను నెలకొల్పడానికి, అడుగడుగునా తనను నిరుత్సాహపరుస్తూ వెనక్కు లాగిన వారిని ఎదుర్కోడానికి చాలా కష్టపడింది.

శ్రమించడం, సంప్రదాయాల్ని ధిక్కరించి నిలబడడం తనకు కొత్త కాదు. చిన్నతనం నుంచి కుటుంబంలోనూ, కుటుంబం వెలుపలి ప్రపంచంలోనూ తను చూచిన, తన పరిధిలోకి వచ్చిన ప్రతి అన్యాయాన్ని, సంవత్సరాల తరబడి చెలామణి అవుతున్న అణచివేతల్ని ఎదిరించేది. ఎదిరింపు...

"ఎందుకలా గొడ్డును బాదినట్లుగా బాదుతావు?" తాత చేతిలోని కర్ర నాయనమ్మ వంటి మీద పడకుండా అడ్డుకుంటూ నిలదీసింది తను. ప్రాణం బాగోక పడుకున్న నాయనమ్మను గేదెలకు కుడితిపెట్టలేదనే నెపంతో బాదుతున్న తాత రౌద్ర రూపాన్ని చూడడానికి భయం వేస్తున్నప్పటికి ధైర్యాన్ని కూడదీసుకుని అడ్డుకుంది తను. "పొద్దుటి నుండి చాకీరీ చేస్తూనే ఉంది కదా. ఇంతకు ముందే జ్వరం వచ్చి వాంతి అయి, ఒళ్లు తూలి పడుకుంది" తనింకా పూర్తి చేయకముందే ఇంట్లోని ఆడవారందరినీ బూతులు తిట్టడం మొదలు పెట్టాడు తాత. ఇంటిపెద్ద, తాతే ఇలా ఉంటే ఆయన వారసులు పెదనాన్న, నాన్న, బాబాయిలు తక్కువ తిన్నారా? వాళ్ళాయన్ని మించిన వారు.

"ఏంటే ఈ నీలుగుడు? పొద్దస్తమానం కడుపునిండా మెక్కి పొర్లటం తప్ప మీరందరూ ఇంట్లో ఊడబొడిచేదేంటి." తాతయ్య తిట్లు విని ఆగ్రహం వెళ్ళగ్రక్కనూ లేక, సహించి మౌనంగా వుండనూ లేక సణుక్కుంటున్న పెద్దమ్మ

పెదనాన్న మాటలకు ఉక్రోషంతో విరుచుకుపడింది.

"అవును, కోడి కూయకముందే లేచి ప్రొద్దస్తమానం నడ్డి విరిగేలాగా మేము చేసే చాకిరి పని గాదు. పొలంలో మీరు వెలగబెట్టేదే పని" ఆ మాటకే పెద్దమ్మ వీపు మీద పిడిగుద్దు పడింది.

"ఏం తప్పు మాట్లాడిందని పెద్దమ్మని కొడుతున్నావు? రోజంతా క్షణం తీరిక లేకుండా పనులు చేస్తానే వున్నారు కదా... ఊరికే కూర్చున్నట్లు మాట్లాడతావేమిటి? మీరూ మేమూ కడుపునిండా తిన్నాక మిగిలిందే కదా ఆళ్లు తింటోంది?" పన్నెండేళ్లయినా నిండని తను ఎదిరించి మాట్లాడుతూంటే చిర్రెత్తుకొచ్చింది పెదనాన్నకు.

"మంచి బుద్ధులే అబ్బుతున్నాయిరా కూతురికి" తన మీది కోపం నాన్న మీద చూపిస్తూ, రుంజుకుంటూ గొడ్ల దొడ్లోకి వెళ్ళాడు పెదనాన్న.

ప్రేమ, ఆలంబన, బంధం అనే విశిష్ట లక్షణాలతో నిర్మించబడవలసిన కుటుంబం హింసాత్మక మానవసంబంధాల కేంద్రంగా మారడం అత్యధిక కుటుంబాల విషయంలో నిజమే అయినా, తమ కుటుంబం విషయంలో ఇది మరీ తీవ్రస్థాయిలో ఉండి తనకు ఊపిరాడనట్లుగా ఉండేది. పదిమంది పిల్లలున్న ఇంట్లో మగ పిల్లలందర్నీ ఒక రకంగా ఆడపిల్లలందర్నీ ఒక రకంగా చూడడం తనకు ఉక్రోషం తెప్పించినా మిగతా ఆడపిల్లలు నోరు విప్పటానికే జంకేవారు. తను నోరు విప్పి ఎదిరించినా తిట్లు తినడం తప్ప ఫలితముండేది కాదు. ఇంట్లోని ఆడవారిపై హింసను అతిసన్నిహితంగా చూస్తూనే ఉన్నప్పటికీ ఆ చిన్న వయసులో పెద్దమ్మ అంత పెద్ద నోరు పెట్టుకుని ఎందుకు అరుస్తుందో, చిన్న పిన్ని అస్తమానం ఫిట్లు వచ్చి ఎందుకు పడిపోతుందో, పెద్ద పిన్ని కేవలం పని చెయ్యడానికే పుట్టినట్లు మరో ధ్యాస లేకుండా ఎప్పుడూ పని చేస్తూనే ఎందుకుంటుందో, అమ్మ ఎప్పుడూ తనలో తను ఎందుకు మాట్లాడుకుంటూ ఉంటుందో అర్థమ య్యేది కాదు. అంత వయసు వచ్చాక కూడా తాతయ్య తిట్లు, తన్నులూ తినే నాయనమ్మ కోడళ్ళని కాల్చుకు తినడం తనకు ఆశ్చర్యాన్ని కలిగించేది.

"ఆ నాలి ముచ్చెదవకి నా కుతుర్ని కట్టబెట్టావంటే ఊరుకోను. నా శవం మీద నుంచే ఆ పల్లకి లేవాలి." మంగక్కని పెదనాన్న తన పేకాట స్నేహితుని కొడుక్కిచ్చి పెళ్ళి చెయ్యాలని చూస్తుంటే పెద్దమ్మ ప్రతిఘటించింది.

"నువ్వేవత్తివే ఊరుకోకపోవడానికి... ఈ ఇంట్లో ఆడముండలక్కూడా నోళ్లొస్తున్నాయి. మగాళ్ళం గాజులు తొడుక్కుకూచుంటామిక" జనపనార తాళ్ళు పేనుతూ అరుగు మీద కూర్చున్న పెదనాన్న లంఘించి ఉరికి, పెద్దమ్మ జుట్టు పట్టుకుని తలను వంచి వీపు మీద బాదుతూంటే భయంతో బిక్కచచ్చిపోయి చూచింది తను.

అలా అనేక సందర్భాలలో ఫలితం ఉండదని తెలిసి కూడా ప్రతిఘటిస్తూ పోరాడుతున్న పెద్దమ్మను చూచి తనకు ఆశ్చర్యం కలిగేది. అన్యాయాన్ని ధిక్కరించడం, న్యాయం కోసం పోరాడడం జీవలక్షణం. ఆ లక్షణాన్ని కోల్పోయాక జీవితం మృత ప్రాయమని గ్రహించింది కూడా పెద్దమ్మ నుంచే. ఆ గ్రహింపు వచ్చిన దగ్గర్నుండి తన ప్రతి అడుగూ పోరాటమే అయింది. ఇంట్లోని ఆడవాళ్ళపై నిత్యం, నిరంతరం అమలవుతున్న హింసకు వ్యతిరేకంగా తన పోరాటం ప్రారంభ మయింది. ఇన్నేళ్ళుగా తమ మనఃశరీరాలను నలిబలి చేస్తున్న హింసను ప్రతి ఘటించడం, తమ మనసుల్లో బయటికి రాకుండా పేరుకు పోయిన వందలాది ప్రశ్నల్ని తన నోటి వెంట వినడం వారికి లోలోపల ఆనందం కలిగిస్తున్నప్పటికీ మళ్ళీ ఏం పుట్టి మునుగుతుందోనని గజగజలాడేవారు. తన ధైర్య సాహసాలు తన అక్క చెల్లెళ్ళను విభ్రాంత పరచేవే తప్ప తనెంతగా ప్రోత్సహించి ధైర్యం చెప్పినా తన వెంట నిలిచే తెగువనిచ్చేవి కావు. శృంఖలాలను తెంచుకుని ప్రశ్నించే చైతన్యాన్ని నిలుపుకోవాలంటే సంఘర్షించక తప్పదనే ఆలోచనే తనను ముందుకు నడిపించేది.

"ఎన్నాళ్ళిలా తిట్లూ, దెబ్బలూ తింటారు? దీనికి అంతం అంటూ లేదా?" మగాళ్లు పొలాలకు వెళ్లాక పెద్దమ్మ, అమ్మ గొడ్లదొడ్లో పిడకలు చేస్తూంటే అమ్మ వీపు మీద దెబ్బలకు వెన్న రాస్తూ ఆవేశంగా అడిగింది తను.

"మగాళ్ళు పెళ్ళాలను కొట్టడంలో కొత్తేముందే? ఇంతగా కాకపోయినా మా అమ్మ కూడా దెబ్బలు తింది. ఇప్పుడు మీ నాయనమ్మ తినడం లేదా. అయినా ఒంటి మీద పడితేనే దెబ్బా... మనసు మీద పడే దెబ్బలు ఇంకా సలుపుతాయి కదే." అమ్మ కంఠం దుఃఖంతో పట్టేసింది. నిజమే, శరీరం మీద తగిలే దెబ్బల కంటే మనసుని కుళ్లబొడిచే మాటలు మరింత బాధిస్తాయి. స్త్రీల శరీరాల్ని, మనసుల్నీ బాధించని కుటుంబాలు ఎన్ని వుంటాయి? కానీ ఎదురు తిరగకుండా మౌనంగా భరిస్తూంటే ఈ హింస మరింత తీవ్రమవదా?

"ఇలాగే ఇది మామూలేననుకుంటూ సహిస్తూ జీవితమంతా గడిపేస్తారా? మీ అమ్మను, అత్తను చూచి మీరూ... మిమ్మల్ని చూసి మేము ఇట్లాగే బ్రతకాలా! ఇది మారాల్సిన అవసరంలేదా! మీరు ఎదురుతిరగక పోతే వాళ్ళేం చేసినా చెల్లు బాటయి పోతుందనే ధైర్యంతో ఆగడాలు చేస్తున్నారు కదా?" పేడను ఊకమీద అద్ది పిడకల్ని చరుస్తున్న పెద్దమ్మ చేతిని పట్టుకుని ఆపి, అడిగింది తను.

"ఎదిరించి నేను బావుకుందేముందే అమ్మా! రెట్టింపు దెబ్బలుతినడం తప్ప" అంది పెద్దమ్మ కళ్ళలో నీళ్ళు సుళ్లు తిరుగుతూండగా. చదువు, ప్రపంచజ్ఞానం లేకపోయినా పెద్దమ్మలోని ఆ కాస్త చైతన్యం తనకెంతో ఆశను కల్పించేది.

"నువ్వొక్కదానివీ ఒంటరిగా పోట్లాడడం కాదు. అమ్మ, నువ్వు, పిన్నిలు కలిసి తిరగబడండి. మీరెంత పని చేసినా ఒక్క మంచి మాట లేకపోగా ఇంత హింసా? ఈసారి మీలో ఏ ఒక్కరి వంటిమీద దెబ్బపడినా మీరందరూ కలిసి 'మాలో ఎవరిని కొట్టినా మీ మర్యాద దక్కదని తెగేసి చెప్పండి." అంది తను.

'తన శవం మీద నుండే మంగక్క పల్లకి వెళ్ళాలని' బెదిరించిన పెద్దమ్మ చివరి క్షణం వరకు పోరాడినప్పటికీ అదే వరుని వెంట మంగక్క అత్తవారింటికి కాపురానికి వెళ్తుంటే నిస్సహాయంగా చూస్తూ ఊరుకోవలసిన పరిస్థితి ఇంకా తమ కళ్ళ ముందు నుండి చెరిగిపోలేదు.

"ఇది నా ఇల్లు, నా ఇష్టం, నాకూతుర్ని నాకిష్టమొచ్చిన వాడికిచ్చి పెళ్ళి చేస్తాను. నీ దిక్కున్న చోట చెప్పుకో ఫో!" అంటూ పెదనాన్న పెద్దపెద్ద రంకెలు వేస్తున్నప్పుడు వింటున్న ఏ ఒక్కరికీ ఇన్నేళ్ళుగా విశ్రాంతి నెరుగకుండా చాకిరి చేస్తున్న కోడలికి ఈ ఇంటిపై ఏ హక్కూ లేదా! ఆమె రక్త మాంసాల్ని పంచుకుని పుట్టిన బిడ్డ, ఇన్నేళ్ళూ ఆమె తన కంటిపాపలా సాకిన బిడ్డ ఆమెకేమీ కాదా? అని పించలేదు అనే విషయం కూడా గుర్తొచ్చింది. 'ఎదిరించేకంటే ఆ చట్రంలో ఒదిగి ఉండిపోతేనే హాయి' అనే నిస్పృహ పెద్దమ్మకు, అమ్మకు, పిన్నిలకు కలిగి తనను చల్లార్చటానికి కూడా ప్రయత్నించేవారు. కాని తన ఆవేశం చల్లారలేదు. తన ప్రశ్నలు ఆగిపోలేదు సరికదా మరింత విస్తరించి బయటి ప్రపంచంలోనూ, స్కూల్లోనూ కూడా తనను మామూలు ఆడపిల్లల కంటే భిన్నంగా నిలబెట్టింది.

"స్పోర్ట్స్ ఫీజును ఆడపిల్లలం కూడా కడుతున్నాము కదా! డ్రిగ్ పోటీలకు బాయిస్‌నేనా తీసుకెళ్లేది, మమ్మల్నెందుకు తీసుకెళ్ళరు?" అంటూ స్పోర్ట్స్ అభిరుచి వున్న ఆడపిల్లల్ని వెంటబెట్టుకుని వెళ్ళి హెడ్‌మాస్టర్ని, డ్రిల్లు మాస్టర్ని నిలదీసి

తన మాట నెగ్గించుకుని, టీమ్‌కు నాయకత్వం వహించి విజయవాడలో జరిగిన డ్రిగ్ పోటీలలో పాల్గొనడమే కాక అనేక కప్పుల్ని, షీల్డ్‌ని గెలుచుకుని వచ్చిన రోజున అందరూ ముక్కు మీద వేలేసుకున్నారు. 'ఇది పిల్ల కాదు, పిడుగు' అన్నారు. ఎదిరించి పోరాడి నిలిచే విజేతనే చివరకు లోకం గౌరవిస్తుందనే సత్యం ఈ క్రమంలో తనకు మరింత బలంగా అనుభవంలోకి వచ్చింది.

ఉన్న ఊళ్లో హైస్కూలు చదువు పూర్తయ్యాక దగ్గర్లోని పట్టణంలో కాలేజి చదువుకు వెళ్లవలసి వచ్చినప్పుడు ఇంట్లో వాళ్ళందరూ ఏకమై తనను అడ్డుకున్నారు. ఆడపిల్ల పైఊరి కెళ్ళి చదివితే తమ ఇంటి పరువేంకావాలన్నారు. ఈ ఇంటి ఆడపిల్లకు ఉద్యోగం చెయ్యాల్సిన గతేంటన్నారు. ఉన్న ఊళ్ళో కాబట్టి మగ రాయుడిలా తిరిగినా సరిపోయింది. పై ఊళ్ళో ఏదన్నా జరిగిందంటే తలెత్తుకు తిరగగలమా! అని అంగలార్చారు. నిత్యం హింసతో నిండి ఉండే తమ ఇంటి పరువెంతటిదో తనకు తెలియనిది కాదు, తమ ఇంటికి ఎంత గొప్ప స్తోమతవుందో కూడా తనకు తెలియనిది కాదు. వారి కపటపు మాటలు, బూటకపు పరువు ప్రతిష్టలూ తనను అడ్డుకోలేవని తెలిసికూడా వాళ్లు సర్వవిధాలా ప్రయత్నించారు. ఇంట్లోని మగపిల్లలు ఒక్కొక్క క్లాసు దాటడానికి రెండు, మూడు సంవత్సరాలు పడుతున్నప్పటికి అప్పులు చేసైనా వారిని చదివించడానికి తెగ తాపత్రయపడే కుటుంబం, మంచి మార్కులు తెచ్చుకున్న తన పైచదువుకు కాలు అడ్డుపెట్టడం చూచి తను ఆవేశపడింది.

కాని, నాయనమ్మ, పెద్దమ్మ తనను దగ్గర కూర్చోబెట్టుకుని యింటి ఆర్థిక పరిస్థితి ఎంత దీనంగా వుందో వివరించాక తన ఆవేశం జారిపోయింది. డాక్టరవాలనే తన జీవిత లక్ష్యం నెరవేరడం లేదనే వ్యథ వున్నప్పటికీ మరింక ఎక్కువ పట్టుబట్టలేదు.

"సరే నాయనమ్మా! పెద్ద చదువులకు తూగలేమని అంటున్నారుగనుక టీచర్ ట్రెయినింగ్‌కి వెళ్తాను. ఎవడికో ఒకడికి నన్ను కట్టబెట్టి చేతులు దులుపుకుందామనుకుంటున్నాడు నాన్న. దానికి మాత్రం చచ్చినా ఒప్పుకోను" ఆశాభంగం బాధిస్తున్నప్పటికీ 'ఒక వృత్తి ఎక్కువదీ, మరొక వృత్తి తక్కువదీ కాదు. దేనినైనా అంకిత భావంతో చెయ్యడం ముఖ్యం. దేనిలోనైనా రాణించడం ప్రధానం' అని తనకు తాను నచ్చజెప్పుకుంది. ఎన్నో వాదోపవాదాలు, ఎంతో పోట్లాట తరువాత గానీ తను టీచర్‌ట్రెయినింగ్ కోర్సులో చేరడానికి తన కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు.

తన ట్రెయినింగ్ పూర్తయి ఉద్యోగంలో చేరిన రెండేళ్ళకు రాఘవను తను పెళ్ళాడతానని అన్నప్పుడు మళ్ళీ ఇంట్లో యుద్ధవాతావరణం ఏర్పడింది. వాళ్ళ పెత్తనాన్ని జ్ఞానం వచ్చినప్పటినుంచి ఎదిరిస్తూనే ఉన్నప్పటికీ తమ పెద్దరికాన్ని నిలపకుండా, తమ సమ్మతి తీసుకోకుండానే స్వతంత్రంగా తమ ఇంటి ఆడపిల్ల నిర్ణయం తీసుకోవడం వాళ్ళకు మింగుడుపడలేదు. తన జీవితాన్ని కంట్రోలు చేయడానికి ఎవరికీ అవకాశమివ్వని తను తన స్వంత నిర్ణయం మీద నమ్మకం పెట్టుకుని రాఘవను పెళ్ళాడింది.

ఎంతో కాలం గడవకుండానే తన కాపురంలో కలలుకరిగాయి. రాఘవ తగిలించుకున్న సంస్కారపు బురఖా తొలిగి అతనిలోని 'పురుషుడు' బయట పడుతున్నపుడు, అతను తనమీద, తన సంపాదన మీద పెత్తనం చేస్తూ తనను కంట్రోలు చెయ్యడానికి ప్రయత్నిస్తున్నప్పుడు ఈ వ్యవస్థ ఎంత ధృఢమైనదో మరొకసారి అనుభవంలోని వచ్చింది. జీవితానుభవం పెరుగుతున్న కొద్దీ తమ జీవితాల తాలూకు వివిధ అంశాలలోకి, భిన్న రంగాలలోకి వ్యవస్థ ఎంత పటిష్టమైన ఊడల్ని దించుకుని ఎలా ఎక్కడా బెసగనివ్వకుండా చేస్తుందో కూడా అర్థమ యింది. రాఘవను పూర్తిగా అర్థం చేసుకునే లోగానే పుట్టిన పాప, న్యాయాన్ని ప్రతిష్టించడం కోసం, స్వేచ్ఛను, ఆత్మగౌరవాన్ని నిలుపుకోవడం కోసం ప్రతి ఘటించడం, సంఘర్షించడమే అలవాటయిన తనకు రాజీ పడక తప్పని పరిస్థితి కల్పించింది.

ఈ రాజీ పడడంలో తన మనసు నలిబిలి అయింది. తనే కాదు, తనలా చదువుకుని సంపాదన పరులైన స్త్రీలు కూడా చదువుకూ, వికాసానికీ దూరమయి హింసాత్మక కుటుంబంతో, హింసాత్మక సమాజంతో సంఘర్షిస్తూ, రాజీపడుతూ బ్రతుకుల్ని ఈడుస్తున్న మెజారిటీ పేద స్త్రీల లాగానే హింసను అనుభవించడం, కొత్తకొత్త రూపాల్లో ఈ హింస అమలవడం తనకు దిగ్భ్రాంతిని కలిగించేది.

వృత్తి రీత్యా అనేక స్కూల్స్‌లో టీచర్‌గా పని చేసింది తను. ముప్పై ఏళ్ల క్రితం తనీ ఉద్యోగంలో చేరినప్పుడున్న 'బ్రతకలేక బడిపంతులు' అన్న ఇమేజి ఈనాడు లేదు. ఇన్నేళ్లుగా సమాజం లోనూ, తమ వృత్తిలోనూ విలువల పరిణామాలనేకం వచ్చినా విద్యార్థులకు సవ్యంగా బోధించి వారిని జ్ఞానవంతుల్ని చేయడమే తన పవిత్ర ధర్మంగా విశ్వసించి ఉద్యోగం చేసింది తను. రెండు సంవత్సరాల క్రితం ఈ మారుమూల గ్రామం పెదపాకలోని ఎస్.సి. హైస్కూల్‌కి

ట్రాన్స్ఫర్ అయి వచ్చాక ఇన్నేళ్లూ తను చేసింది ఒక ఎత్తు, ఇక ముందు చేయబోయేది మరొక ఎత్తు అనిపించింది. జీవితం తన ముందొక ఛాలెంజిని విసిరినట్లనిపించింది.

స్కూలు పరిస్థితిని గమనిస్తున్న కొద్దీ తను కలవరపడసాగింది. స్కూలు ఫీజులు లేకున్నా, బట్టలూ, పుస్తకాలూ ప్రభుత్వమే ఇస్తున్నా, స్కూలు తెరిచి మూడు నాలుగు నెలలయ్యే సరికి క్లాసుల్లో సగం విద్యార్థులు బడి మానేసేసరికి తను అలజడి చెంది తోటి టీచర్స్‌ని వాకబు చేసింది.

"ఊడుపులయినాయి కదా మేడమ్! పొలం పనులకెళ్ళి బడి మానేసారు. పనులకాలంలో ఇంటిల్లిపాదీ పనులకెళ్ళందే బ్రతుకు గడవదు గద మేడమ్. ఇదో, పనులయిపోయాక సగం మంది పిల్లగాళ్ళన్నా మళ్ళీ బడికొస్తారు." తను పదేపదే అనడం విని అదే ఆవరణలో వున్న ప్రాథమిక పాఠశాల టీచర్ మేరి అంది. మేరీ అలా చెప్పినప్పటికీ తన మనసాగక మేరీని వెంటబెట్టుకుని ఊరికి వెలుపల వున్న పేటలోని విద్యార్థుల ఇళ్ళకు వెళ్ళింది. ఒక్కొక్కచోట కనిపించిన దృశ్యం తన మనసును కలచివేసింది. పసితనం వదలని ఇరవైఏళ్ళలోపు తల్లి, తల్లి పన్లోకెళ్తే చిన్నారి చెల్లెల్నో, చిట్టి తమ్ముడినో పెంచడం కోసం బడి మానేసి తల్లులుగా మారిన ఆరేడేళ్ళ ఆడపిల్లలు, వ్యసనాలకు లోనయిన తండ్రి కుటుంబాన్ని పట్టించుకోకపోతే పనుల్లో చేరి తల్లితో పాటు కుటుంబ భారాన్ని తమ లేలేత భుజాలపైకి ఎత్తుకుంటున్న ఆడపిల్లలు, మగపిల్లలు - ఈ వాస్తవాలు తనకు తెలిసినవే అయినా ప్రత్యక్షంగా చూచి చాలా మథనపడింది తను.

"మందని మల్లేసినట్లు మల్లేస్తున్నామే తప్ప వీళ్ళకు మేము ఏం టీచింగ్ చెయ్యగలుగుతున్నాం మేడమ్! ఇరవై ముప్పైమంది పట్టే గదిలో ఏభై అరవై మందిని కుక్కుతున్నాం. ఇంతమంది కుర్ర సన్నాసుల్ని ఊరకుండబెట్టడానికే టైమంతా అయిపోతుంది గదా. ఇంకా టీచింగేం జేస్తాం. ఇక్కడింత చట్టు బండలుగా వుంటే ఆళ్లకిక్కడ చదువుకోవాలనేం అనిపిస్తది. ఆయనెవరో పెద్దాయన అన్నట్లు ఈ పిల్ల వాళ్ళంతా 'డ్రాపవుట్లు' కాదు, 'డ్రైవౌట్లు'." మేరీ చెప్పేదంతా తెలిసిందే అయినా వింటూంటే మనసు క్రుంగిపోయింది.

అనేకసార్లు పేటకు వెళ్ళి పిల్లల తల్లి దండ్రులకు నచ్చచెప్పి, బ్రతిమాలి దాదాపుగా అందరూ స్కూలుకు వచ్చేలా చేసింది, కానీ మధ్యలో నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, లేక మరేది కావాలన్నా, ఏ విధమైన డబ్బు అవసరం వచ్చినా,

తల్లి అనారోగ్యంతో పనిలోకి వెళ్ళలేకపోయినా బడి మానేసి పనికి వెళ్లి సంపాదించు కోవడాన్ని ఆపడం సాధ్యం కాదని తెలిపోయింది. సమాజంలో ఎంతో పెద్ద ఆర్థిక పరిణామం వస్తే గానీ పిల్లలందరూ మానకుండా చదువుకునే లక్ష్యం నెరవేరదని తెలిసినప్పటికీ బడి మానకండని వాళ్ళకు పదే పదే ఉద్బోధిస్తూనే వుంది తను.

హాఫ్ ఇయర్లీ పరీక్షలు జరిగి వాళ్ళ పేపర్లుదిద్దాక గానీ ఈ స్కూల్లో ఉత్తీర్ణతా శాతం అంత తక్కువగా ఎందుకుందో అర్థం కాలేదు తనకు. తక్కువ మంది పాసవడానికి ఎన్నో కారణాలుండొచ్చు. మాస్టర్లు, శ్రద్ధగా పాఠాలు చెప్పక పోవడమనేది ప్రధాన కారణాల్లో ఒకటి కావచ్చు. కానీ ప్రత్యేకించి పిల్లల తెలివితేటల్లో లోపం మాత్రం కారణం కాదు. క్లాసులో విన్న పాఠాలలో ప్రశ్నలడిగితే చక్కగా జవాబు చెప్తున్నారు. కానీ పరీక్షల్లో ఎందుకు తక్కువ మార్కులు వస్తున్నాయి అని గుంజాటన పడుతున్న తనకు వాళ్ళ పేపర్లు చూసాక అసలు కారణం తెలిసింది. చాలా మంది దస్తూరి బ్రహ్మరాతలా ఎవరికీ అర్థం కాకుండా వుండడం వల్లే చాలా మంది పరీక్షల్లో తప్పుతున్నారని తెలిసాక వారి దస్తూరిని సంస్కరించే ప్రయత్నం చేసింది తను. ఆ ప్రయత్న సాఫల్యం వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం గణనీయంగా పెరగడంలో ప్రతిబింబించింది. ముందు తన ప్రయత్నాన్ని చాదస్తంగా కొట్టి పారేసిన వారికి కనువిప్పు కలిగింది. తనతో పాటు ప్రయత్నించిన సహోపాధ్యాయులకు నూతన ఉత్తేజం వచ్చింది.

ఈ సంవత్సరం ఆ ప్రయత్నాన్ని తన మాట తీసేయలేని మొహమాటంతోనో, కేవలం తన మీద గౌరవంతోనో కాక ఒక పవిత్రమైన బాధ్యతగా భావించి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అధ్యాపకులు కృషి చేసారు. వక్తృత్వం, వ్యాసరచన, ఆటలు, పాటలు, నాటకాలు, మోనో ఏక్షన్లు మొదలైన అన్నిటిలో విద్యార్థులకు అభిరుచి కలిగించి, శిక్షణనిచ్చి మండలస్థాయిలో, జిల్లాస్థాయిల్లో జరిగే పోటీలకు తీసుకు వెళ్లారు. వారు గెలుచుకు తెచ్చిన బహుమతులు, కప్పులు, షీల్డ్స్ చూచి స్కూలు వాతావరణమే ఉత్తేజితమయింది. ఇంతకు మునుపు ఈ స్కూలునీ, ఈ స్కూలు టీచర్స్‌నీ పెద్దగా పట్టించుకోని ఊరి జనం ఇప్పుడు వారి వంక గౌరవంగా చూస్తున్నారు.

వీటన్నింటికీ గొప్ప ముక్తాయింపు ఈనాటి వార్షికోత్సవం, పాటలు, డాన్సులు, ఏకపాత్రాభినయం, మిమిక్రీ, నాటిక - అభిరుచి, ఆసక్తి, ప్రతిభ కనబరిచిన వారికందరికీ అవకాశమిస్తూ కార్యక్రమాల్ని రూపొందించారు. ఉచ్చారణ,

అభినయం, మేకప్, దుస్తులు ప్రతిఒక్క స్వల్పవిషయాన్ని స్వయంగా పర్యవేక్షించింది తను. అధ్యాపకులంతా తన వెన్నంటి నిలిచి కృషి చేసారు. వారు మొత్తం కార్యక్రమానికయ్యే ఖర్చునంతటినీ భరించటానికి తమంతట తాము ముందుకు రావడం తనకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

అన్నిటికంటే విశేషం 'చెదలు పట్టి డొల్లగా మారిన వ్యవస్థను మార్చడానికి చేసే ఇలాంటి వ్యక్తిగత ప్రయత్నాలు, వ్యక్తిగత ఔదార్యాలు, శరీరమంతా చీము చేరివున్నప్పుడు ఒక వేలికో కాలికో ఆయింట్‌మెంట్ పూసి నయంచేయడానికి ప్రయత్నించడం లాంటిది.' అని మొదట్లో తేలిగ్గా మాట్లాడిన సోషల్ మాస్టారు కొన్ని రోజులు గడిచాక "టీచర్ గారూ! ఇది ఒక మహాప్రస్థానానికి వేసే మొదటి అడుగు." అంటూ భావోద్వేగంతో చలిస్తూ చెప్పడం.

నిజానికి తామంతా చేస్తున్న చిన్ని ప్రయత్నానికి మహాప్రస్థానంలాంటి పెద్దమాటను చేర్చడం భావ్యం కాదని తనకు తెలుసు. తమ పరిధిలో తమకు చేతనయిన కృషి చేసి ఏ చిన్న మార్పుకయినా దోహదం చేస్తే చాలు అనుకుంటూనే, 'ఆలోచన మొట్ట మొదట ఒక్క మెదడులోనే వికసించవచ్చు. ఆదర్శం మొదట ఒక్క గుండెలోనే నినదించవచ్చు. కానీ ఆ ఆలోచన తాలూకు విద్యుత్తు సమూహానికి ప్రవహించక తప్పదు. ఆ ఆదర్శపు ప్రతిధ్వనులు సమూహపు గుండెల్ని తట్టక తప్పదు' అని కూడా తననుకుంది.

మార్మోగుతున్న చప్పట్ల శబ్దంతో ఇహ లోకంలోకి వచ్చింది ఝాన్సీ. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వచ్చిన డి.ఇ.ఓ., ఎమ్.ఎల్.ఎ. వెళ్ళి పోవడానికి లేచి నిలబడి హెడ్ మాస్టారిని ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు. వేదికకు ఒక ప్రక్కగా నిలబడి మౌనంగా అందరిని చూస్తుంది ఝాన్సీ. ఝాన్సీ కోసం అటూ ఇటూ చూచిన హెడ్ మాస్టారు ఆమెను పిలిచి ముఖ్య అతిధులకు పరిచయం చేసి, ఊహకందని ఈ ఉత్సవానికి మూల విరాట్టు ఈమే అని చెప్తుంటే, ప్రచారం అంటే ఇష్టపడని ఝాన్సీ ఇబ్బందిగా ముఖం పెట్టి ఒక ప్రక్కకు ఒదిగినుంచుంది.

అతిధులు వెళ్ళిపోయారు. పిల్లల తల్లి దండ్రులు విప్పారిన ముఖాలతో ఈ కొత్త అనుభవాల్ని పరస్పరం పంచుకుంటున్నారు. ఊరు ప్రజలు తాము 'అలగాజనం' 'లేబర్' అని ఈసడింపుగా అనే ఈ పిల్లల్లో ఇంత సామర్థ్యం వుందా? అని ఆశ్చర్యపడుతున్నారు. సమాజంలోని అట్టడుగు పొరల్లో జీవిస్తున్న ఈ విద్యార్థుల ప్రతిభ, కౌశలం వారిని అబ్బుర పరుస్తున్నాయి. 'ప్రతిభ ఏ ఒక్క

కులం, ఏ ఒక్క మతం సొత్తు కాదు' అనే ప్రగతి వాదుల మాటలు మనుషులుగా రూపాంతరం చెంది సాకారంగా తమ ముందున్నారు అనే వాస్తవం ఝూన్సీ హృదయాన్ని అనంతమైన ఆనందంతో నింపుతోంది.

నెమ్మదిగా జనం పలచబడ్డారు. కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలంతా తమ వేషాలు తియ్యకుండానే ఝూన్సీని వెదుక్కుంటూ వచ్చారు. చేతులు జోడించి సజల నయనాలతో తమకు ఒకకొత్త జన్మనిచ్చిన దేవతను చూచినట్లు భక్తితో, ఆరాధనతో ఆమె వంక చూస్తున్నారు. పెదవి విప్పితే ఈ ఆనందం తాలూకు గాఢత తగ్గిపోతుందేమోనన్నట్లుగా మౌనంగా వారిని చూపులతోనే అలింగనం చేసుకున్న ఝూన్సీలోని 'అమ్మ' ఆకాశాన్ని ఆవరించింది.

- "ఆంధ్రప్రదేశ్", 2001